సాక్షి సిద్దిపేట

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



'భవిత'కు భరోసా IIలో..

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చికిత్స, సాయం అందించేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. చిన్నారుల బంగారు భవిష్యత్‌కు ఇవి ఎంతో భరోసా ఇస్తున్నాయి.



నెత్తురోడిన రహదారి

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. IIలో..



గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. IIIలో..

న్యూస్‌రీల్

మల్లన్న సేవలో అదనపు డీసీపీ



మల్లన్న సన్నిధిలో అదనపు డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని సోమవారం అదనపు డీసీపీ (అడ్మిన్) అందె శ్రీనివాస్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

నాగోసు కుంట ధ్వంసం.. నీరంతా వృథా



మత్తడి రాళ్లను తొలగించడంతో వృథాగా పోతున్న నీరు

నంగునూరు(సిద్దిపేట): కోనాయిపల్లి శివారులోని నాగోసు కుంటను ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో నీరంతా వృథాగా పోతోంది. సోమవారం వ్యవసాయ బావుల వద్దకు వచ్చిన రైతులు పంట పొలాల్లో పారుతున్న నీటిని చూసి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జేఈఈ జక్కుల రాజు కుంటను పరిశీలించి మత్తడి రాళ్లను తొలగించడంతో నీరంతా వృథాగా పోతున్నట్లు గుర్తించారు. రాజగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, రెండు రోజుల్లో మత్తడి కట్టను మరమ్మతు చేయిస్తామని ఏఈ తెలిపారు.

ఐఓసీ నిర్మాణ పనులు వేగిరం చేయండి

దుబ్బాక: పట్టణంలో జరుగుతున్న ఐఓసీ భవన నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఐఓసీ భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈనెలాఖరులోపు భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, లేని పక్షంలో కాంట్రాక్టర్ పై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్లో ఎలక్షన్ స్ట్రాంగ్ రూమ్‌ను, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈవీఎం మిషన్లు రాగానే గట్టి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారిని ఆదేశించారు.

రేపటి నుంచి రెండో ఏఎన్ఎంల సమ్మె

సిద్దిపేటకమాన్: రెండో ఏఎన్ఎంలు సమ్మె బాట పడుతున్నారు. సంబంధించిన నోటీసును జిల్లా వైద్యాధికారులకు అందజేసినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో ఏఎన్ఎంల సమస్యల పరిష్కారం కోసం వైద్యారోగ్యశాఖ కమిషనర్, ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. చేసేదిలేక ఈనెల 16నుంచి సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, రెండో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఏవైఐఎంయూఎన్‌లో పాల్గొన్న గజ్వేల్ విద్యార్థిని



లహరి

గజ్వేల్‌రూరల్: మలేషియాలో జరిగిన ఏవైఐఎంయూఎన్ (ఆసియా యూత్ ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్) 12వ కాన్ఫరెన్స్‌లో గజ్వేల్‌కు చెందిన విద్యార్థిని బండోజు లహరి పాల్గొని ప్రసంగించారు. తడ్కపల్లికి చెందిన బండోజు కృష్ణమూర్తి (ఆర్మీ రిటైర్డ్), రమాదేవి దంపతులకు కూతురు లహరి, కొడుకు అభినయ్ ఉన్నారు. గజ్వేల్‌లోని వాసవి నగర్‌లో నివాసముంటున్నారు. కృష్ణమూర్తి పిల్లలిద్దరూ బాసరలోని ట్రిపుల్ ఐటీలో విద్యనభ్యసిస్తున్నారు. లహరి ఇన్‌స్టాకు వచ్చిన మెసేజ్‌కు రిప్లై ఇవ్వడంతో కాన్ఫరెన్స్‌కు ఎంపికైనట్లు సమాధానం వచ్చింది. దీంతో కార్యక్రమంలో పాల్గొంది. లహరి మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల ఆధ్వర్యంలో వైద్యరంగంలో చేపడుతున్న అంశాలపై మాట్లాడే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు.



జాతీయ జెండాలతో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

హర్‌ఘర్ తిరంగా.. ఎగరేద్దాం ఘనంగా

ఇంటింటా జాతీయ జెండా ఎగరేద్దామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి. రఘురాం పిలుపునిచ్చారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది జాతీయ జెండాలతో సిద్దిపేటలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేందుకే ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. రాజ్యాంగ ఫలాలను దేశంలోని పౌరులందరికీ అందేలా న్యాయవ్యవస్థ ఎప్పటికప్పుడు కృషి చేస్తోందన్నారు.

\- సిద్దిపేటకమాన్



దుబ్బాక పట్టణంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు తదితరులు

దళితబంధు లొల్లి

జిల్లాలో నిత్యం రోడ్డెక్కుతున్న దళితులు

- దగా చేస్తున్నారంటూ మండిపాటు
- అర్హులకు ఇవ్వడం లేదంటూ ఆగ్రహం
- బీసీలకు ఆర్థిక సాయంపైనా అసంతృప్తి
- ఎన్నికల వేళ ప్రజాప్రతినిధులకు తలనొప్పులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జగదేవ్‌పూర్ మండలం నిర్మల్‌నగర్ దళితులు

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పంచాయితీ నడుస్తోంది. దళితుల అభివృద్ధి కోసం దళిత బంధును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గతంలోనే మొదటి విడత దళిత బంధును అందజేసింది. తాజాగా రెండో విడత కోసం లబ్ధిదారుల పేర్లను స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా సేకరిస్తున్నారు.. త్వరలో అమలు చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తుండగా అర్హులకు ఇవ్వడం లేదని పలు చోట్ల ఆందోళనలు, ప్రభుత్వం, సీఎం కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నారు. ఇలా జిల్లాలో రోజుకు ఎక్కడో ఓ చోట ఆందోళనలు జరుగుతునే ఉన్నాయి.

జనాభా ఎక్కువ.. యూనిట్లు తక్కువ

సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) ప్రకారం జిల్లాలో 10,72,419 మంది జనాభా ఉన్నారు. అందులో ఎస్సీలు 2,07,248, బీసీలు 6,77,810 మంది ఉన్నారు. రెండో విడతలో దళిత బంధుకు ప్రతి నియోజకవర్గానికి 1,100, బీసీలకు ఆర్థిక సాయం కోసం నియోజకవర్గానికి 300 చొప్పున అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలాల వారీగా జాబితాలను సిద్ధం చేసి కలెక్టర్ అనుమతితో మంజూరు చేయనున్నారు. జనాభా ఎక్కువగా.. యూనిట్ల మంజూరు తక్కువ కావడంతో అందరికీ పథకాలు అందకపోవడంతో ప్రజలు ఆందోళనలు, రాస్తారోకోలు, దిష్టిబొమ్మల దహనం చేస్తున్నారు.

ఎన్నికల సమయంలో ఇబ్బందులు

దళిత బంధు, బీసీలకు ఆర్థిక సాయం పథకాలు ఎన్నికల సమయంలో ప్రజా ప్రతినిధులకు తలనొప్పి తెచ్చిపెడుతున్నాయి. దళిత బంధుకు మేము అర్హులం కాదా అని ప్రజలు రోడ్డెక్కుతున్నారు. నియోజకవర్గానికి మంజూరైన వాటి ప్రకారం గ్రామాల వారీగా పంచారు. లబ్ధిదారుల ఎంపికను స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులకు అప్పగించారు. దీంతో పలు చోట్ల అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు వారికి అనుకూలమైన వారిని ఎంపిక చేస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా ఆందోళనలు

- జగదేవ్‌పూర్ మండలం నిర్మల్‌నగర్‌లో అర్హులందరికీ దళిత బంధును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దళితులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు దళిత బంధులో ఎంపిక చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- జగదేవ్‌పూర్ మండలం అలిరాజ్‌పేట, తిమ్మాపూర్ గ్రామాల్లో రోడ్ల పై నిరసన తెలిపారు. అలాగే తిమ్మాపూర్‌లో సర్పంచ్ ఇంటి ఎదుట ధర్నాను సోమవారం నిర్వహించారు.
- జగదేవ్‌పూర్ మండలం తిగుల్, బస్వాపూర్, నిర్మల్‌నగర్ గ్రామాలకు చెందిన దళితులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. జగదేవ్‌పూర్- భువనగిరి ప్రధాన రహదారిపై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.
- జనగామ నియోజకవర్గం కొమురవెల్లి మండలం గురువన్నపేటలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిల దిష్టిబొమ్మలను సొంతపార్టీ కార్యకర్తలే దహనం చేశారు. దళిత బంధు, బీసీలకు ఆర్థిక సాయం, గృహలక్ష్మి పథకాలలో పేదలకు అన్యాయం చేస్తున్నారని కార్యకర్తలు ఆరోపించారు.

వంటావార్పుతో నిరసన



కొండపాక(గజ్వేల్): మండలంలోని జప్తినాచారంలో దళిత మహిళల ఆందోళన మూడో రోజుకు చేరుకుంది. సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట వంటావార్పుతో వినూత్న నిరసన చేపట్టారు. కుటుంబ సభ్యులతో తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామానికి మంజూరైన పథకం యూనిట్ల డబ్బులు అందరికీ వర్తించేలా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు వారికి అనుకూలంగా ఉన్నవారికే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. పథకం వర్తించిన వారే ప్రభుత్వానికి ఓట్లు వేస్తారా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలోమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఊరిలో ఒకే కుటుంబం.. అయినా దక్కని బంధు



జగదేవ్‌పూర్(గజ్వేల్): గుంట జాగ లేదు.. ఉండేందుకు గూడు లేదు.. కూలీ చేస్తేనే పూట గడిచే కుటుంబం.. అయినా దళితబంధు పథకానికి నోచుకోలేదు. సీఎం నియోజకవర్గం జగదేవ్‌పూర్ మండలం కొత్తపేటలో దళిత కుటుంబం ఎరుపుల బాలనరసింహ, సత్తమ్మ దంపతులు. వీరికి ముగ్గురు కూతుళ్లు, ఇద్దరి పెళ్లిళ్లు చేశారు. చిన్న కూతురు సరిత బీఈడీ చేసి జగదేవ్‌పూర్‌లో ఓ ప్రయివేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. తల్లి కూలీ, తండ్రి పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు మంజూరైనా కొత్తపేటలో ఉన్న ఒకే ఒక్క కుటుంబానికి కేటాయించక పోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంద్రాగస్టుకు ముస్తాబు

- ఉదయం 11గంటలకు జాతీయజెండాను ఆవిష్కరించనున్న మంత్రి హరీశ్ రావు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ఏర్పాట్లను పరిశీస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేటలోని డిగ్రీ కళాశాల మైదానం 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమైంది. ఏర్పాట్లను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేతలు సోమవారం పరిశీలించారు. ఉదయం 11గంటలకు రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించనున్నారు. జిల్లా ప్రగతిపై ప్రజలను ఉద్దేశించి చేసే ప్రసంగిస్తారు. అలాగే తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వారంరోజులుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లను సీపీ శ్వేత తో కలిసి కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలకు ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోలీస్ శాఖ పరేడ్ కు సిద్ధం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో రమేష్, పోలీస్, జిల్లా ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

- 11 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, గౌరవ వందన స్వీకరణ
- 11:15 నుంచి 11:30 గంటల వరకు జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి ప్రసంగం
- 11:30 నుంచి 11:45 వరకు కళాకారులకు సన్మానం
- 11:45 నుంచి 12గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు

అర్జీలు సత్వరం పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో అందించిన వినతులను సత్వరం పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో కలిసి గరిమా అగర్వాల్ అర్జీలు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గరిమా అగర్వాల్ మాట్లాడుతూ బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, రెండు పడక గదుల ఇళ్లు, ఆసరా పింఛన్ల తదితర సమస్యల పరిష్కారానికి 46 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

త్వరలో గిరిజనులకు తీపికబురు

సీఎం కేసీఆర్‌ను కలిసిన గిరిజన నేత



సీఎం కేసీఆర్‌కు గిరిజన స్థితిగతులపై వివరిస్తున్న గుగులోతు తిరుపతినాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం పెద్దతండా గ్రామానికి చెందిన, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుగులోతు తిరుపతినాయక్ సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతినాయక్ మాట్లాడుతూ అక్కన్నపేట మండలంలో చాలా గిరిజన తండాలు ఉన్నాయని అన్నారు. మరో ఆరు గిరిజన తండాలను జీపీలుగా ఏర్పాటు చేయడం అభినందనీయమని, గిరిజనులు తమకు రుణపడి ఉంటారని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు. అలాగే రానున్న రోజుల్లో గిరిజన లోకానికి తీపికబురు చెప్పనున్నట్లు సీఎం కేసీఆర్ చెప్పారని అన్నారు. అక్కన్నపేట మండల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని వివరించానన్నారు.

ఫార్మసీ కళాశాలకు అనుమతి



ఫార్మసీ కళాశాల భవనం

- 60 సీట్లతో తరగతులు ప్రారంభం
- ఓయూ అనుబంధంగా నిర్వహణ
- త్వరలోనే అడ్మిషన్లు ప్రారంభం



ఫార్మసీ కళాశాలలో ల్యాబ్ పరికరాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేటలో విద్య మరింతగా చేరువవుతోంది. వివిధ కళాశాలల మంజూరు, వాటికి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. చిన్నకోడూరు మండలం రామంచ శివారులో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీరంగనాయక స్వామి ఫార్మసీ కళాశాలకు ఫార్మసీ కౌన్సిల్ అనుమతి లభించింది. మంత్రి హరీశ్‌రావు చొరవతో రూ.10 కోట్లతో కళాశాల భవన నిర్మాణం చేపట్టారు. ఈ విద్యా సంవత్సరం (2023-24) నుంచి బీ ఫార్మసీ మొదటి సంవత్సరంతో కోర్సు ప్రారంభమవుతుంది. 60 సీట్లతో మొదటి సంవత్సరం అడ్మిషన్‌కు అనుమతిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాలేజీకి 9293 నంబర్ కేటాయించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయానికి అనుబంధంగా నిర్వహణ ఉంటుంది. కళాశాల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

మంత్రి హర్షం

ఫార్మసీ కళాశాల అనుమతి పట్ల మంత్రి హరీశ్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. సిద్దిపేట విద్య హబ్‌గా మారుతున్న నేపథ్యంలో మరో అడుగు ముందుకు పడిందన్నారు. ఫార్మసీపై ఆసక్తిగల విద్యార్థులకు ఇక్కడే చదువుకునే గొప్ప అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వచ్చే కొద్ది రోజుల్లో సొంత భవనంలోనే విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు.

రేపటి నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్

సిద్దిపేటకమాన్: జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 16నుంచి 31వ తేదీ వరకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే (లెప్రసీ కేస్ డిటెక్షన్) నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. జిల్లాలోని 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 2,29,687 గృహాలను వైద్య సిబ్బంది సందర్శించి సర్వే నిర్వహిస్తారన్నారు. ఆశా కార్యకర్తలు వ్యక్తి శరీరంలోని స్పర్శలేని భాగాలు ఎమైనా ఉంటే వాటిని పరీక్షించడం, రాగి, గోధుమ రంగులో శరీరంపై మచ్చలు తదితరవాటిని గుర్తిస్తారన్నారు. అనుమానితులకు పూర్తి స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

మద్యం దుకాణాలకు 1,081 దరఖాస్తులు

సిద్దిపేటకమాన్: జిల్లాలోని మద్యం దుకాణాలకు సోమవారం వరకు 1,081 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి తెలిపారు. జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు నూతన లైసెన్స్ కోసం సిద్దిపేట సర్కిల్‌లో 331, గజ్వేల్ సర్కిల్‌లో 352, హుస్నాబాద్ సర్కిల్‌లో 196, చేర్యాల సర్కిల్‌లో 126, మిరుదొడ్డి సర్కిల్‌లో 76 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

హామీల అమలులో విఫలం

సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి



మీర్జాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. సోమవారం మీర్జాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయలేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో సీపీఐని ఆదరించాలని కోరారు.

పోరాటం చేస్తాం

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రజల సమస్యల పరిష్కరించేవరకు పోరాడుతామని సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి, కేశవాపూర్, పెద్దతండా, కట్కూర్ తదితర గ్రామాల్లో ప్రజల వద్దకు సీపీఐ, ప్రజా సమస్యలపై పోరాటం అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గృహలక్ష్మి, బీసీబంధు, దళితబంధు, రైతు బంధు పథకాలు కేవలం బీఆర్ఎస్ నాయకులకే అందజేస్తున్నారని మండిపడ్డారు.

క్లుప్తంగా

బడిలో పాముల కలకలం



అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని ముస్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో పాములు కలకలం రేపాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడుపాములు బయట పడడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం మధ్యాహ్నం తరగతి గదిలోకి వెళ్లిన విద్యార్థులు పామును చూసి అరిచారు. అక్షయ పాత్ర సిబ్బంది, స్థానికులు అక్కడికి చేరుకుని పామును చంపివేశారు. అయితే మరోవైపు నుంచి ఒక్కో పాము రావడంతో వారు విస్తుపోయారు. మొత్తం ఆరు పాములను చంపివేశారు. తరగతి గది అపరిశుభ్రంగా ఉండడంతో పాములు సంచరిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి కథనం ప్రకారం.. యూపీకి చెందిన రాకేష్ రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారి పక్కన డీమార్ట్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. అతడి వద్ద నుంచి 3.5 కిలోల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

బాలికపై బాలుడి అత్యాచారం

న్యాల్‌కల్ (జహీరాబాద్): బాలికపై బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని ఓ గ్రామంలో చోటు చేసుకొంది. జహీరాబాద్ డీఎస్పీ రఘు కథనం ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన బాలుడు (16), అదే గ్రామానికి చెందిన బాలిక (14) ఇద్దరి ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. బాలుడు బాలికను ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెను లోబర్చుకొని అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వారు హద్నూర్ పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని బాలుర నేరస్తుల కారాగారానికి తరలించారు. బాలికను సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి సఖీ కేంద్రానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ రఘు తెలిపారు.

తేనెటీగల పెంపకంతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న కె.ఎస్.కుమార్

ములుగు(గజ్వేల్): తేనెటీగల పెంపకంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని.. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని మేఘాలయ ఫార్మర్స్ ఎంపవర్‌మెంట్ కమిషనర్ కె.ఎస్.కుమార్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల పరిశోధన కేంద్రం (ఎఫ్‌సీఆర్‌ఐ)లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీన్, సీఎం కార్యాలయ ఓఎస్‌డీ ప్రియాంకవర్గీస్, తదితరులు పాల్గొన్నారు.

భవితకు భరోసా



దివ్యాంగులకు బోధిస్తున్న ఐఈఆర్పీ సుకన్య (ఫైల్)

- దివ్యాంగ పిల్లలకు చేయూత
- వైకల్యాన్ని జయించేందుకు ప్రత్యేక శిక్షణ

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చికిత్స, సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. వివిధ కారణాలతో దివ్యాంగులైన చిన్నారుల బంగారు భవిష్యత్‌కు ఇవి ఎంతో భరోసాను ఇస్తున్నాయి. వారికి తగిన చేయూతనిచ్చి వైకల్యాన్ని జయించేందుకు మార్గం చూపుతున్నాయి. జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా తగిన ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో 37 కేంద్రాలు

సంగారెడ్డి జిల్లాలోని భవిత (ఐఈఆర్సీ) కేంద్రాలకు చెందిన రిసోర్స్‌పర్సన్లు ఇంటింటికీ తిరిగి దివ్యాంగుల సమగ్ర అవసరాలను గుర్తించి వారిని భవిత కేంద్రాలకు తరలిస్తున్నారు. జిల్లాలో 42 మంది ఐఈఆర్పీలు, 8 మంది ఫిజియోథెరపిస్ట్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు చిన్నారులకు వైద్యసేవలతో పాటు విద్యను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 37 భవిత కేంద్రాల ద్వారా చిన్నారులకు చేయూతనిస్తున్నారు. ప్రతి సోమవారం ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. మానసిక, శారీరక, బహుళ వైకల్యం కలిగిన పిల్లలకు ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారు పూర్వస్థితికి వచ్చేలా ఆత్మవిశ్వాసం కలిగిస్తున్నారు.

2,182 మంది దివ్యాంగ పిల్లలు

జిల్లాలో మొత్తం 2,182 మంది పిల్లలు వైకల్యంతో బాధపడుతున్నారు. వీరందరినీ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి మండలంలోని భవిత కేంద్రాల ద్వారా పాఠశాల విద్యాశాఖ తరఫున ఉచిత శిక్షణ ఇస్తున్నారు. శస్త్రచికిత్స సైతం ఉచితంగా చేయిస్తున్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ప్రతి కేంద్రానికి ఇద్దరిని నియమించి అర్హులైన ఫిజియోథెరపిస్ట్ ద్వారా వారానికి ఒకసారి చికిత్స చేయిస్తున్నారు. ప్రతీ కేంద్రంలో ప్రత్యేక కేర్ టేకర్‌ను నియమించి చిన్నారుల అవసరాలను గుర్తిస్తున్నారు. ప్రతి ఐఆర్‌పీ ఉపాధ్యాయుడు తనకు కేటాయించిన పాఠశాలకు వెళ్లి అక్కడి విద్యార్థుల పరిస్థితిని గుర్తించి, వారి అభ్యసన ప్రవర్తనపై సంబంధిత ఉపాధ్యాయులతో చర్చించి తగిన సూచనలు చేస్తున్నారు. ప్రతి శనివారం పాఠశాలకు రాలేని దివ్యాంగ చిన్నారుల ఇళ్లకు వెళ్లి వారికి శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు ఫిజియోథెరపీతో పాటు ప్రత్యేక ఉపకరణాల ద్వారా ఆటపాటలతో మెలకువలు నేర్పిస్తున్నారు. మండల కేంద్రాల్లోని భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ చిన్నారులకు నెలకు రూ. 300 చొప్పున అలవెన్స్ అందిస్తున్నారు. ఉచిత మెడికల్ క్యాంపుల ద్వారా మూడు చక్రాల సైకిళ్లు, రోలేటర్స్ ఉచితంగా ఇస్తున్నారు. క్రమం తప్పకుండా కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సదరం సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఉచిత బస్‌పాస్, రైల్వేపాస్‌లు సైతం అందజేస్తున్నారు.



సదాశివపేటలో భవిత కేంద్రం

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం

ప్రత్యేక శిక్షణ ద్వారా దివ్యాంగులలో ఎంతో మార్పు వస్తోంది. ఆర్టీసీ సహకారంతో ఉచిత బస్‌పాస్‌లు ఇప్పిస్తున్నాం. ఉద్యోగాల్లో సైతం ప్రభుత్వం 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తుంది. దివ్యాంగ పిల్లలను తీర్చిదిద్దేందుకు వారి నైపుణ్యాల అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది.

– వెంకటేశం, భవిత కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్

వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి



పాప మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

సిద్దిపేటకమాన్: వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతిచెందిన సంఘటన సిద్దిపేట పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం రిమ్మనగూడకు చెందిన మల్కగండ్ల రాజుకు తొగుట మండలం తుక్కాపూర్‌కు చెందిన రజనితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు. మొదటి కూతురుకు ఐదేళ్లు, రెండో కూతురు తన్విక (2) సంతానం కలదు. రజని తల్లిగారి ఊరు అయిన తుక్కాపూర్‌కు కొద్ది రోజుల క్రితం పిల్లలతో కలిసి వచ్చింది. బుధవారం ప్రమాదవశాత్తు రెండో కూతురు తన్వికపై వంట చేసి ఆర్చిన గంజి పడింది. దీంతో పాపకు గాయాలు కాగా కుటుంబ సభ్యులు పట్టణంలోని సందీప్ పిల్లల ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తీసుకువచ్చారు. పాపను పరీక్షించిన వైద్యుడు గాయం మానే వరకు రోజూ పాపకు డ్రెస్సింగ్ చేయాలని చెప్పారు. కాగా సోమవారం పాపకు డ్రెసింగ్ చేస్తున్న సమయంలోనే పరిస్థితి విషమంగా మారిందని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. దీంతో పాపను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు పాప అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే పాప మృతి చెందిందని కుటుంబ సభ్యులు మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

దసరా సెలవుల్లో ఎస్‌ఎన్‌ఐసీ క్యాంపు

ఎన్‌సీసీ డీడీజీ వీఎం రెడ్డి



మహతి ఆడిటోరియంను పరిశీలిస్తున్న ఎన్‌సీసీ డీడీజీ వీఎం రెడ్డి, తదితరులు

గజ్వేల్‌రూరల్: దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కాడెట్ల ప్రత్యేక శిక్షణను గజ్వేల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉమ్మడి ఏపీ, తెలంగాణ, ఎన్‌సీసీ(డీడీజీ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హాస్టల్, కళాశాల ఆడిటోరియంతో పాటు పట్టణంలోని మహతి ఆడిటోరియంను నిజామాబాద్ గ్రూప్ అధికారి కల్నల్ సునీల్ అబ్రహంతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఎన్ఐసీ (స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపును దసరా సెలవుల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ల నుంచి అత్యుత్తమ కాడెట్‌లు ఈ క్యాంపులో పాల్గొనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కల్నల్ సంజయ్‌గుప్తా, సంగారెడ్డి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పీఎస్ నందా, సుబేదార్ మేజర్ సురేంద్ర గురుంగ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌బాబు, అధ్యాపకులు, ఎన్‌సీసీ కాడెట్లు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడుతాం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



కొత్తూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): పేదల పక్షాన పోరాడేందుకు కాంగ్రెస్ ఎల్లప్పుడు సిద్ధంగా ఉందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరులో సోమవారం గడపగడపకు పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. డబుల్ బెడ్రూం, దళిత బంధు, బీసీబంధు, మైనార్టీ బంధులతో మరోసారి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలోనే బడుగు, బలహీనవర్గాలు అభ్యున్నతి చెందాయన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, నాయకులు బూరం గణేష్‌యాదవ్, కర్ణాకర్‌గౌడ్, రాజుయాదవ్, నహిముద్దీన్, సీతారాంరెడ్డి, రవీందర్, పరుషోత్తం, పరమేశ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొడుకు పట్టించుకోవడం లేదు సారూ...



కలెక్టరేట్‌లో వృద్ధురాలు నాగలక్ష్మి

సిద్దిపేటరూరల్: వృద్ధాప్యంలో ఆలనా పాలనా చూడాల్సిన కొడుకు పట్టించుకోవడం లేదని ఓ వృద్ధురాలు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చింది. వివరాల్లోకి వెళితే.. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన వారణాసి నాగలక్ష్మికి ఒక కొడుకు, ఆరుగురు బిడ్డలు. కొడుకు నా పేరిట ఉన్న ఇల్లు, వ్యవసాయ భూమిని అతడి పేరుపై ఎక్కించుకున్నాడని.. 30 ఏళ్ల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లగొట్టడంతో కూతుర్ల వద్ద ఉంటూ పెన్షన్ డబ్బులతో కాలం వెల్లదీస్తున్నట్టు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కొడుకు ఏమాత్రం పట్టించుకోవడం లేదని.. కలెక్టర్‌ను కలిస్తే న్యాయం జరుగుతుందని వచ్చినట్టు తెలిపింది.

హాస్టల్ సిబ్బంది వేతనాలు పెంచండి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: జిల్లావ్యాప్తంగా మోడల్ స్కూల్‌లోని హాస్టల్ సిబ్బందికి జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మోడల్ స్కూల్ హాస్టల్ నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలని కోరుతూ కలెక్టరేట్ ఏఓ రెహమాన్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్ ఎంప్లాయిస్ వర్కర్స్ అతి తక్కువ వేతనాలతో పదేళ్లుగా పనిచేస్తున్నారన్నారు. వీరిని 2018లో సర్వశిక్షా అభియాన్‌లో విలీనం చేశారన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు బాలు, రాధిక, సుజాత ఇందిరా, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి..

చెరువులో పడి ఇద్దరి మృతి



పోచయ్య(ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి నీటి మునిగి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలకేంద్రమైన జగదేవ్‌పూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇప్ప పోచయ్య (28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పని ఉందని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రెడ్డమైన చెరువులో కాలకృత్యాలు తీసుకోవడానికి వెళ్లి నీటి మునిగాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. సోమవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మీ కొడుకు చెరువులో మునిగాడని తెలపడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు చెరువు వద్దకు చేరుకున్నారు. గజ ఈతగాళ్లను రప్పించి మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తూప్రాన్: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందిన సంఘటన పట్టణంలోని పెద్ద చెరువులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం... శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన హనుమంతు (21) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. స్థానికంగా దుకాణాల వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పట్టణ సమీపంలోని పెద్ద చెరువు వద్దకు కాలకృత్యాలు తీసుకోవడం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.



హనుమంతు మృతదేహం

శ్రీకాళహస్తికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు



సందీప్(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): దైవ దర్శనానికి శ్రీకాళహస్తి వెళ్లిన యువకుడు అక్కడే మృత్యువాతపడ్డాడు. సోమవారం ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన శ్యామలపల్లి వెంకటేశ్వరచారి, శారద దంపతుల ఏకైక కుమారుడు సందీప్ (26) రెండేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం దైవ దర్శనం కోసం తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్లాడు. అయితే అక్కడ ఎం జరిగింది..? ఎలా చనిపోయాడనే విషయం తెలియరాలేదు. ఆధార్ కార్డు ఆధారంగా అక్కడి పోలీసులు గుర్తించి సమాచారం అందించారు. మృతిదేహాన్ని తీసుకురావడానికి సర్పంచ్, గ్రామస్తులు వెళ్లినట్లు సమాచారం.

దైవ దర్శనానికి వచ్చి అనంతలోకాలకు..



లక్ష్మణ్ మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): ఏడుపాయల వన దుర్గాదేవి దర్శనానికి వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మహ్మద్ గౌస్ కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా సూరారానికి చెందిన కొర్ర లక్ష్మణ్ (33) అక్కడే ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి ఏడుపాయల దర్శనానికి వచ్చి రాత్రి అక్కడే ఉన్నారు. అప్పటికే మద్యం తాగి ఉన్న లక్ష్మణ్ భార్య అనితతో గొడవకు దిగాడు. అదే రాత్రి ఇంటికి వెళ్తున్నానని చెప్పి నడుచుకుంటూ వెళ్లాడు. ఉదయం కిష్టాపూర్ బస్‌షెల్టర్‌లో పడిపోయి ఉండగా.. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే మృతుడు రాత్రి నడుచుకుంటూ కిష్టాపూర్ వరకు రావడం.. తీవ్ర ఆయాసానికి లోనై గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నెత్తురోడిన రహదారులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం .. ఇద్దరికి గాయాలు

కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన దాస్ (30) జీవనోపాధి కోసం ఐదు నెలల క్రితం తెల్లాపూర్‌కు వలసవచ్చాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మై హోమ్స్ లేబర్ క్యాంపులో నివాసం ఉంటూ సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి తెల్లాపూర్ సమీపంలోని రేడియల్ రోడ్డుపై బైక్‌పై వెళ్తూ ముందు వెళుతున్న కారును ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన దాసును స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



అన్వర్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు. ఈసంఘటన మండలంలోని దుద్దెడ శివారు దర్గా కమాన్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లికి చెందిన అన్వర్ పాషా(42) దుద్దెడలోని టోల్ ప్లాజాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం సిద్దిపేటలో ఓ ఫంక్షన్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో దర్గా కమాన్ వద్ద వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రాంగ్‌రూట్‌లో వెళ్లి..

వట్‌పల్లి(అందోల్): ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టగా ఒకరు మృతి చెందారు. ఈఘటన మండల పరిధిలోని సంగుపేట వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లికి చెందిన బోయిని సతీష్‌కుమార్ (30)ఆదివారం రాత్రి స్కూటీపై సంగుపేట గ్రామ రోడ్డు నుంచి రాంగ్‌రూట్‌లో అల్మాయిపేట వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొట్టింది. తీవ్రగాయాలతో సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖలీల్‌పూర్ శివారులో గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

న్యాల్‌కల్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఖలీల్‌పూర్ గ్రామ శివారులో సోమవారం జరిగింది. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (35) సోమవారం బీదర్- జహీరాబాద్ రోడ్డు గుండా వెళ్తున్న క్రమంలో ఖలీల్‌పూర్ గ్రామ సమీపంలో జహీరాబాద్ నుంచి బీదర్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

దంపతులకు గాయాలు..

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తి శివునూర్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా రాజంపేటకు చెందిన భార్యాభర్తలు గాయపడ్డారు. గ్రామానికి చెందిన అమర్‌నాథ్ తన కుటుంబంతో పాటు కామారెడ్డిలో నివాసం ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నాడు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడి మామను తీసుకురావడానికి కారులో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. జప్తిశివునూర్ వద్ద రోడ్డు పనులు జరుగుతుండగా నెమ్మదిగా వెళ్తున్నాడు.. ఈక్రమంలో వెనుకనుంచి వచ్చిన లారీ వీరి కారును వేగంగా ఢీకొంది. ఈప్రమాదంలో కారులో ఉన్న దంపతులు అమర్‌నాథ్, ప్రవంతి గాయపడగా, చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

మద్యానికి బానిసై..



జహంగీర్(ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో జరిగింది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాగుల జహంగీర్ (38) గ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మద్యం తాగి భార్యతో గొడవకు దిగేవాడు. ఆదివారం రాత్రి సైతం మద్యానికి డబ్బులు కావాలని భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం చూడగా ఇంటి దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలికి చేరుకుని మృతి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పితో..



నర్సింలు మృతదేహం

హత్నూర(సంగారెడ్డి): కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుండ్లమాచవరంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింలు (55) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్న తగ్గలేదు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే మళ్లీ కడుపునొప్పి రావడంతో భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వచ్చిచూడగా అప్పటికే మృతి చెందాడు. సోమవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఒంటరి జీవితం భరించలేక..



మల్లేశం(ఫైల్)

హుస్నాబాద్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన గీత కార్మికుడు బత్తిని మల్లేశం (38) ఆదివారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మల్లేశంకు ఇద్దరు సంతానం కాగా కొంతకాలం క్రితం భార్య మృతిచెందింది. కొడుకు, కూతురు వివాహం కాగా మల్లేశం ఒంటరి జీవితం భరించలేక మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది రాత్రి ఇంటిలోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

చెట్టును ఢీకొన్న లారీ: క్లీనర్ మృతి



సోహెల్ మృతదేహం

హత్నూర(సంగారెడ్డి): లారీ డ్రైవర్ అజాగ్రత్త క్లీనర్ ప్రాణం తీసింది. ఈసంఘటన మండలంలోని మంగాపూర్ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ సుభాష్ కథనం ప్రకారం.. తాండూరు నుంచి బండల లోడుతో కరీంనగర్ వెళ్తున్న లారీ మంగాపూర్ శివారులోకి రాగానే డ్రైవర్ నిర్లక్ష్యంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో తాండూర్ ఇంద్రనగర్‌కు చెందిన సోహెల్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ సంఘటనా స్థలం నుంచి పరారు కాగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.